సర్వం సిద్ధం : ఆర్వో వెట్రిసెల్వి

ఏలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు కౌంటింగ్‌కు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి తెలిపారు. ఆదివారం కౌంటింగ్ ఏర్పాట్లను ఆమె అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం అవుతుందని, లెక్కింపు రెండు రోజులు సమయం పట్టే అవకాశం ఉందన్నారు. మూడు షిఫ్ట్‌ల్లో 700 మంది సిబ్బందిని నియమించామని, 28 టేబుళ్లు, 17 రౌండ్లలో కౌంటింగ్ జరుగుతుందన్నారు. జేసీ ధాత్రి రెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు పాల్గొన్నారు.



ఎండ ప్రభావంతో వెలవెలబోయిన తాడేపల్లిగూడెం మార్కెట్

సన్ డే

పెరిగిన ఉష్ణోగ్రత

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి. జిల్లాలో ఆదివారం 35 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. శివరాత్రి తర్వాత పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి వేళ కూడా ఉక్కపోత పెరుగుతుంది. ప్రస్తుతం రాత్రి వేళ ఉక్కపోత లేకున్నా పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఎండ తీవ్రతకు ఆదివారం రద్దీగా ఉండే తాడేపల్లిగూడెం మార్కెట్ జనం లేక వెలవెలబోయింది. సాయంత్రం 4 గంటల తర్వాత జనం రద్దీ కనిపించింది. ఉదయం 9 గంటలకే ఎండ వేడి అధికం కావడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. మధ్యాహ్నం ప్రధాన రహదారులపై జన సంచారం తగ్గింది. వేసవి ఆరంభంలోనే ఎండ వేడిమి ఈ స్థాయిలో ఉంటే మేలో మరింత అధికంగా ఉంటుందని ఇప్పటినుంచే ఆందోళన వ్యక్తమవుతోంది.

కౌంటింగ్..టైమ్!



సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లు

నేడు ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం ప్రారంభంకానుంది. ఈ మేరకు ఏలూరు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ జరుగుతున్న తీరును రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పర్యవేక్షిస్తారు. అభ్యర్థుల పక్షాన ఏజెంట్లు సైతం కౌంటింగ్‌కు హాజరవుతారు. ఈ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కాస్త సుదీర్ఘంగానే కొనసాగబోతోంది.

- నిరవధికంగా కౌంటింగ్ ప్రక్రియ
- షిఫ్టుల వారీగా సిబ్బంది నియామకం
- ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి
- ప్రాధాన్యతా ఓట్లను బట్టి ఫలితం
- 36 గంటలకు పైగా సమయం పట్టే అవకాశం

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పట్టభద్రుల నియోజకవర్గ ఓట్లను సోమవారం లెక్కించనున్నారు, గత నెల 27న పోలింగ్ జరగ్గా 2 లక్షల 18 వేల 902 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా అధికార పక్షం భావిస్తోంది. పోలింగ్ సమయంలోనే నువ్వానేనా అనే ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో గత ఐదురోజులుగా పోటీ చేసిన 35 మంది అభ్యర్థులతో పాటు, వారి అనుచరులు ఫలితం కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సాధారణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ పట్టభద్రుల నియోజకవర్గంలో ప్రాధాన్యతా ఓటు ప్రకారం కొనసాగుతుంది. ఈ ప్రక్రియ అత్యంత సంక్లిష్టం కావడంతో కౌంటింగ్ సిబ్బందికి తగినంత శిక్షణ ఇచ్చారు. సోమవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఉదయం 6.30 గంటలల్లోపే నిర్దేశిత ప్రాంతాలకు చేరుకోవాల్సిందిగా సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఓట్ల లెక్కింపు సిబ్బంది, టేబుల్స్ సూపర్‌వైజర్లు, రోల్ ఇన్‌చార్జులు, పర్యవేక్షణాధికారులు తమ పరిధిలో బాధ్యతలు నిర్వర్తించాల్సిందిగా ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు తెరిచే సమయంలో, కట్టలు కట్టడం, ఆ తర్వాత లెక్కించే సమయంలో ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాల్సిందేనని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి ఆదేశించారు. ఈ మేరకు జూమ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించి మార్గనిర్దేశం చేశారు.



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్వో వెట్రిసెల్వి

షిఫ్టుల వారీగా సిబ్బంది..

సాధారణ ఎన్నికల కంటే భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ నేపథ్యంలోనే దాదాపు 2లక్షలకు పైగా బ్యాలెట్ పత్రాలను లెక్కించాల్సి ఉంది. అందుకే ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభిస్తారు. తొలుత మొత్తం పోలైన ఓట్లలో చెల్లుబాటు కాని ఓట్లను గుర్తిస్తారు. ఇవి పోను, మిగిలిన ఓట్లను ప్రాధాన్యత క్రమంలో ఏ అభ్యర్థికి దక్కాయో వరుసగా లెక్కిస్తారు. ఈ ప్రక్రియ యావత్తు కొనసాగడానికి కాస్త సమయం పడుతుంది. ఓట్ల లెక్కింపు నిరవధికంగా కొనసాగడానికి వీలుగా లెక్కింపు సిబ్బంది, అధికారులను షిఫ్టుల వారీగా నియమించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పోలైన 2లక్షల18వేల902 ఓట్లను ఒక కొలిక్కి తేవాలంటే ఒకరోజంతా పడుతుందని భావిస్తున్నారు. ఏలూరు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళా శాలలో జరిగే ఓట్ల లెక్కింపునకు 28 టేబుళ్లు.. 17 రౌండ్లుగా ఉండేటట్లు నిర్దేశించారు. దీనికి అనుగుణంగా అన్నీ ఏర్పాట్లు చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 35 మంది అభ్య ర్థులు పోటీ చేసినందున ఆ మేరకు మరింత అప్రమత్తం అయ్యారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. ముందుగా చెల్లని ఓట్లను తొలగించడం, మిగతా ఓట్లను కట్టలుగా కట్టి టేబుల్‌కు వెయ్యి చొప్పున మొత్తం 28 టేబుళ్లకు కలిపి 28వేల వేల ఓట్లు లెక్కించడం ఆరంభిస్తారు. ఇలా 17 రౌండ్లు లెక్కింపు కొనసాగబోతుంది. రాత్రి పొద్దుపోయే సమయానికి కూడా ఈ ముందస్తు ప్రక్రియ ఒక్క కొలిక్కి రాగలదని, ఆ తర్వాతే అసలు సిసలైన ఓట్ల లెక్కింపు గాడినపడనుందని అంచనా వేస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆసాంతం పదేపదే సరిచూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడున్న అధికారిక అంచనాల ప్రకారం లెక్కింపు ఒక కొలిక్కి వచ్చేసరికి దాదాపుగా 36 గంటలు దాటి సమయం పట్టే అవకాశం ఉంది.

- పోలైన ఓట్లు : 2లక్షల18వేల902
- మొత్తం టేబుళ్లు : 28
- మొత్తం రౌండ్లు : 17



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

మూడంచెల భద్రత..

ఏలూరు క్రైం : ఓట్ల లెక్కింపు సందర్భంగా సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు షిఫ్టులుగా బందోబస్తుకు చర్యలు తీసుకున్నారు. మొత్తం 400 మందిని పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించారు. ఆరుగురు డీఎస్పీలు, 16 మంది సీఐలు, 45 మంది ఎస్ఐలు, 333 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను నియమించారు. షిఫ్ట్‌కు 200 మంది విధులు నిర్వర్తించనున్నారు. మూడంచెల భద్రతా వలయంలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్‌యాక్టు 30, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 (సీఆర్‌పీసీ 144) విధించారు. కౌంటింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు.



వేములదీవిలో కొనుగోలు చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

కొలిక్కిరాని కంపోస్టు యార్డ్

వేములదీవి స్థలంపై కసరత్తు

ఆరుగురు సభ్యులతో పురపాలక కమిటీ ఏర్పాటు

నరసాపురం, మార్చి2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సేకరించిన చెత్త డంప్ చేయడానికి పురపాలక సంఘం వేములదీవి గ్రామంలో పదేళ్ల క్రితం 5 ఎకరాల స్థలం కొనుగోలు చేసింది. ఆ స్థలం పురపాలక సంఘానికి కేటాయించినట్లు ఇప్పటికీ రికార్డులు లేవు. దీనితో కంపోస్టు యార్డు సమస్య కొలిక్కిరాలేదు. ఆర్థిక సంఘం నిధులతో 2014లో అప్పటి పాలకవర్గం వేములదీవిలో 5 ఎకరాలు కొనుగోలు చేసింది. మునిసిపల్ కౌన్సిల్ అభ్యర్థన మేరకు అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ అజయ్‌జైన్ ఈస్థలాన్ని పురపాలక సంఘానికి కేటాయించారు. పురపాలక సంఘం నుంచి రూ.26 లక్షలు చెల్లించారు. ఈ స్థలం పురపాలక సంఘానికి కేటాయించినట్లు రికార్డులలో లేకపోవడంతో స్థలం ఎక్కడంటూ గత జనవరి 19న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ అధికారులు మేల్కొని రెవెన్యూ అధికారులను సంప్రదించారు. ఇంత వరకు స్థల సమస్య కొలిక్కి రాకపోవడంతో ఆరుగురి సభ్యులతో కమిషనర్ అంజయ్య ఒక కమిటీని వేశారు. ఇందులో వీసీలు కొత్తపల్లి నాని, కామని నాగిని, కౌన్సిలర్లు కోటిపల్లి సురేష్, పాలూరి బాబ్జీ, మరో ఇద్దరి కౌన్సిలర్లను నియమించారు. త్వరలో ఈ కమిటీ సమావేశమై పురపాలక సంఘానికి సంబంధించిన స్థలం విషయమై ఉన్నతాధికారులతో చర్చించనున్నారు.

ఇల్లు అద్దెకిస్తాం!

పాలకొల్లులో పదుల సంఖ్యలో బోర్డులు

పాలకొల్లు పట్టణంలో ఎక్కువ సంఖ్యలో ఇళ్లకు అద్దెకు ఇవ్వబడును అంటూ బోర్డులు వేలాడుతున్నాయి. పేదల కోసం నిర్మించిన 2,560 టిడ్కో ఇళ్లలో గృహప్రవేశాలు కావడంతో అద్దె ఇళ్లపై ప్రభావం పడింది. పట్టణ శివార్లలో మధ్య తరహా ఇళ్లలో ఉండే లబ్ధిదారులు టిడ్కో ఇళ్లకు తరలిపోవడంతో అద్దె ఇళ్లు ఖాళీ అయ్యాయి. ఇళ్లు అద్దెకు ఇచ్చిన వారు కూడా పేద, మధ్య తరగతి వారు కావడంతో వారి ఆదాయానికి కోత పడింది. చిన్న ఇంట్లో ఒక పోర్షన్ అద్దెకు ఇవ్వడం ద్వారా వారికి కొంత వెసులుబాటు ఉండేది. అద్దె రాబడి తగ్గడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడతాయని పలువురు ఇళ్ల యజమానుల ఆందోళన. ఇంకా 3,500 పైగా టిడ్కో ఇళ్లు కేటాయించ వలసి ఉంది. అది కూడా పూర్తయితే మరిన్ని అద్దె ఇళ్లు ఖాళీ.

- టిడ్కో ఇళ్ల ఆక్యుపెన్సీ ఎఫెక్ట్
- రూ.4వేల లోపు అద్దె ఇళ్లు ఖాళీ
- చిత్తడి ప్రాంతాల్లో ఇళ్లకు అద్దె బోర్డులు
- పాలకొల్లులో మొత్తం టిడ్కో ఇళ్లు 6,144
- లబ్ధిదారులు ఉంటున్న టిడ్కో ఇళ్లు 2,560



పాలకొల్లులో టిడ్కో గృహాలు

పాలకొల్లు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు సమీపంలో నిర్మించిన ఎన్టీఆర్ టిడ్కో ఇళ్లను కొన్నిటిని లబ్ధిదారులకు కేటాయించారు. లబ్ధిదారులు కుటుంబాలతో టిడ్కో ఇళ్లకు వెళ్లడంతో పట్టణంలో అద్దె ఇళ్లు ఖాళీ అయ్యాయి. పలు ప్రాంతాల్లో ఇళ్లకు అద్దెకు ఇవ్వబడును అంటూ బోర్డులు వెలిశాయి. పాలకొల్లు ప్రాంతానికి సంబంధించి 6,144 టిడ్కో ఇళ్లు నిర్మించగా, ఇప్పటికి 2,560 ఇళ్లలో గృహ ప్రవేశాలు చేశారు. దీంతో పట్టణంలోని మధ్య తరహా అద్దె ఇళ్లు ఖాళీ అయ్యాయి. రూ.4వేల లోపు అద్దె ఉన్న ఇళ్లలో మూడింట రెండింతలు ఖాళీగా కనిపిస్తున్నాయి. పట్టణ శివారు ప్రాంతాలలో నిర్మించిన చిన్న తరహా ఇళ్లు చిత్తడి ప్రాంతాల్లోని ఇళ్లపై టిడ్కో ఇళ్ల ప్రభావం పడింది. ఏడాదిన్నరగా పాలకొల్లు పట్టణంలో వందల సంఖ్యలో అద్దె ఇళ్లు ఖాళీగా ఉంటున్నాయి. లాకు దిగువ రామారావు పేట, కొత్తపేట, చింతలతోట తదితర ప్రాంతాల్లో వంద పోర్షన్లకు పైగా ఖాళీ అయ్యాయి.

పట్టణంలో ఎన్టీఆర్ టిడ్కో గృహాల నిర్మాణం గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 80 శాతం పైబడి పూర్తయ్యింది. అనంతరం వైసీపీ ప్రభుత్వ పాలనలో టిడ్కో ఇళ్లను నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో త్వరలో మిగిలిన పనులు పూర్తిచేసి టిడ్కో ఇళ్లను పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించారు. మొత్తం టిడ్కో ఇళ్లను లబ్ధిరాలకు కేటాయిస్తే కుటుంబానికి ఇద్దరు పెద్దలు ఇద్దరు పిల్లలు చొప్పున లెక్కించినా పట్టణం నుంచి సుమారు 25 వేలకు జనాభా కొత్త ఇళ్లకు తరలిపోతారు.

మధ్య తరగతి వర్గాలకు ఇబ్బందులే!

పట్టణంలోని మధ్య తరహా అద్దె ఇళ్లన్నీ దాదాపు ఖాళీ అవుతాయి. స్లమ్ ఏరియాలలో 80 గజాలు, 100 గజాలు విస్తీర్ణంలో చిన్న గదులతో రెండు పోర్షన్లు ఉంటే ఒక పోర్షన్ ఇంటి యజమాని ఉన్నా మరో పోర్షన్ అద్దెకు ఇస్తున్నారు. ఈ తరహా ఇళ్ల యజమానులు చిరు వ్యాపారులు, చిరుద్యోగులు. వారికి వచ్చే ఆదాయానికి తోడుగా ఎంతో కొంత ఇంటి అద్దె ఆదుకునేది. ఇప్పుడు ఇళ్లు ఖాళీ అవ్వడంతో ఆయా ఇళ్ల యజమానులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం ఉన్న నిర్మాణాలు తొలగించి ఆధునిక హంగులతో ఇళ్లు నిర్మించుకునే స్తోమత లేనివారి పోర్షన్లు ఇప్పుడు ఖాళీ అవుతున్నాయి. ఇల్లు పడగొట్టి నూతనంగా నిర్మించే స్తోమత లేనివారు కొద్దిపాటి ఆదాయం కోల్పోతామని పేద, మధ్య తరగతి గృహస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.4వేల లోపు అద్దె పొందుతున్న ఇళ్ల యజమానులకు ఇబ్బందులు తప్పవు. వారి ఇళ్లను ఆధునీకరించేందుకు ప్రభుత్వ రుణాలు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.



ఈద్ ముబారక్

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

దిగిరాని కూరగాయల ధరలు



ఏలూరు రేంజ్‌కు 100 మంది ఎస్ఐలు

నియామక ఉత్తర్వులు అందజేసిన ఐజీ అశోక్ కుమార్

7

చికెన్ @199



బర్డ్‌ఫ్లూ ప్రభావంతో చికెన్, కోడి గుడ్ల అమ్మకాలు ఒక్కసారిగా పడిపోయాయి. నెక్, హేచరీస్, పౌల్ట్రీ రైతులు, అధికారులు చేపట్టిన చికెన్ మేళా, అవగాహన కార్యక్రమాలతో చికెన్ దుకాణాలు తిరిగి తెరుచుకున్నాయి. అయినప్పటికీ కనీస వ్యాపారాలు కూడా సాగడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల చికెన్ అమ్మకాలపై ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్నారు. తణుకు సమీపంలోని వీరభద్రపురంలో కేజీ చికెన్ కొంటే అర కేజీ చికెన్ ఉచితమని ప్రకటించారు. కానీ కొనుగోలుదారులు పెద్దగా స్పందించ లేదు. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో ఒక్కసారిగా పడిపోయిన చికెన్, ఎగ్ ధరలు ప్రస్తుతం దాదాపు సాధారణ స్థాయికి వచ్చాయి. అమ్మకాలు మాత్రం ఆశించిన స్థాయిలో లేవు.

తణుకు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తణుకు మండలం వేల్పూరు, ఉంగుటూరు మండలం బాదంపూడి, పెరవలి మండల కానూరు పౌల్ట్రీ ఫారాల్లో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో జిల్లా యంత్రాంగం కోడి గుడ్లు, చికెన్ వినియోగంపై ఆంక్షలు విధించింది. దీనితో సుమారు మూడు వారాల పాటు చికెన్, గుడ్డు అమ్మకాలు నిలిచిపోయాయి. సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని చికెన్, గుడ్లపై ఆంక్షలు సడలించారు. అయినప్పటికీ వినియోగదారులు వెనకాడడంతో అధికారులు రంగంలో దిగి చికెన్, ఎగ్ మేళాలతో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మూడు వారాల క్రితం కోడిగుడ్డు ధర రూ.6.50 కాగా ప్రస్తుతం రూ.5 చొప్పున విక్రయిస్తున్నారు. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో కోడి ధర (లైవ్) కేజీ రూ. 40 నుంచి రూ.50 ధరకు పడిపోయింది. బాగా ఉడికించిన చికెన్, కోడి గుడ్లను వినియోగించవచ్చని రెండు రోజుల క్రితం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు నెక్, హేచరీస్, పౌల్ట్రీ రైతులు, అధికారులు సంయుక్తంగా చికెన్, కోడి గుడ్ల మేళాలు నిర్వహించారు. ఆదివారం చికెన్ దుకాణాలు తెరచుకున్నాయి. బ్రాయిలర్ కోడి (లైవ్) కేజీ రూ. 90-95 ధరకు విక్రయించారు. చికెన్ కిలో రూ.180, స్కిన్ లెస్ రూ.199, ఫారం కోడి కిలో రూ.180 చొప్పున అమ్మకాలు సాగాయి. అయినప్పటికీ అమ్మకాలు లేకపోవడంతో పలు చోట్ల వ్యాపారులు ఆఫర్లు కూడా ఇచ్చారు. కిలో చికెన్ కొంటే అర కిలో చికెన్ ఉచితం ప్రకటించారు.



వీరభద్రపురంలో చికెన్ దుకాణం

- చికెన్ విక్రయాలపై ప్రత్యేక ఆఫర్లు
- కొనుగోలుదారుల వెనుకంజ
- ఫలితమివ్వని చికెన్, ఎగ్ మేళా

అమ్మకాలు లేవని, వినియోగదారులు ఇంకా వేచి చూసే ధోరణిలో ఉన్నారని వ్యాపారులు చెబుతున్నారు.

అక్కడక్కడా అమ్మకాలు

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్ ప్రాంతాల్లో ఆదివారం అక్కడక్కడా చికెన్ దుకాణాలు తెరుచుకున్నాయి. అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేవు. మటన్, చేప, రొయ్య, పీతలు అధిక ధరకు విక్రయించారు. ఆదివారం మార్కెట్‌లో మటన్ కేజీ రూ.వెయ్యి, రొయ్యలు కేజీ రూ.270, పీతలు సైజును బట్టి రూ.450 నుంచి రూ.650, చేపలు కేజీ రూ.180 నుంచి రూ.190 ధరకు విక్రయించారు.



చికెన్, ఎగ్ మేళాలో పదార్థాలు వడ్డిస్తున్న అధికారులు, పౌల్ట్రీ రైతులు

వేల్పూరులో చికెన్, ఎగ్ మేళా

చికెన్, కోడి గుడ్లను ఆహా రంగా తీసుకోవచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ చెప్పారు. తణుకు మండలం వేల్పూరులో ఆదివారం నిర్వహించిన చికెన్, ఎగ్ మేళాలో ఆయన మాట్లాడారు. రెడ్ జోన్ కిలో మీటరు మినహా మిగిలిన ప్రాంతాల్లో ఏవిధమైన ఆంక్షలు లేవన్నారు. ప్రజలంతా నిర్భయంగా చికెన్, గుడ్లను తినవచ్చన్నారు. చికెన్‌తో తయారుచేసిన పదార్థాలు, ఉడికించిన గుడ్లను పంపిణీ చేశారు. మండల పశువైద్యాధికారి కె.శంకర్ భావనారాయణ, పౌల్ట్రీ రైతులు పెనుమర్తి మోహన్, ముల్లంగి మాధవరావు, జీవీఆర్ చౌదరి, బోడపాటి ఆనందబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు



ఇంకా సమయం పడుతుంది : బండి రామకృష్ణ, చికెన్ వ్యాపారి, వేల్పూరు

చికెన్, కోడి గుడ్ల వినియోగం పెరిగి పౌల్ట్రీ పరిశ్రమలో సాధారణ పరిస్థితులు నెలకొనడానికి ఇంకా 15 రోజులు సమయం పడుతుంది. బర్డ్ ఫ్లూ ప్రభావంతో ఒకేసారి రెడ్ జోన్, అలర్ట్ జోన్ నిబంధనలు, కోళ్లు, గుడ్లను ఖననం చేయడంతో పాటు హేచరీస్ హాలీడే ప్రకటించాయి. మార్కెట్‌లో కోళ్ల కొరత, చికెన్ కొనుగోలుకు వినియోగదారులు ఇంకా వెనకాడడంతో అమ్మకాలు పెరగలేదు.



కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మత్స్యకార సంఘ సభ్యులు

మత్స్యరంగ అభివృద్ధికి చర్యలు తీసుకోండి

భీమవరం టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా మత్స్యకారుల సంక్షేమంతో పాటు మత్స్యరంగ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆదేశించారు. బీజేపీ కార్యాలయంలో శ్రీనివాస వర్మను నూతనంగా ఎన్నికైన ఉమ్మడి జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు మైల వసంత రావు, పాలకవర్గం సభ్యులు కలిశారు. జిల్లాలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సంత మార్కెట్లు, ఫిష్ మార్కెట్లలో వసతులు కల్పించడం, పంచాయతీరాజ్ చెరువుల వేలంలో 10 శాతం పరిమితి దాటకుండా చర్యలు తీసుకోవాలని, వలలు, నావలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని ఎస్టీ, ఎస్సీ, బీసీలకు 75 శాతం పెంచాలని, మత్స్యకార సొసైటీ గ్రామాల్లో మత్స్యకార కమ్యూనిటీ హాల్, మత్స్యకారుల వాహనాలు ఇచ్చే రాయితీ పెంచే విధంగా చర్యలు తీసుకోవాలనే పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన మంత్రి జిల్లా మత్స్యశాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. మత్స్యకారుల సమస్యల పరి ష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైస్ ప్రెసిడెంట్ రాజా బాలాజీ, డైరెక్టర్లు వూడిమూడి శ్రీనివాస్, బేరం శ్రీరామ చంద్రమూర్తి, బెజవాడ నాగరాజు, తిరుమాణి సీతామాలక్ష్మి, మోకా ఆంజనేయులు, జంపా అప్పారావు, కోపనాతి శ్రీనివాసరావు, పిడిగే జోసెఫ్, వైదాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కళకళలాడిన చిన వెంకన్న క్షేత్రం



ద్వారకాతిరుమల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గోవిందుని నామాలతో ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం మారుమోగింది. సెలవుదినం కావడంతో ఆదివారం అధిక సంఖ్యలో భక్తజనులు చిన వెంకన్న ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తుల రద్దీ ప్రారంభమైంది. క్యూలైన్లు, ప్రసా దాల కౌంటర్లు, క్యూకాంప్లెక్స్‌లు, అన్న దానం వద్ద భక్తుల సందడి నెలకొంది. దాదాపు 12 వేల మంది వరకూ స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. దర్శనానంతరం వారంతా వకుళ మాత అన్న ప్రసాద భవనానికి చేరుకుని ఉచిత అన్నప్రసాదం స్వీకరించారు.

గుబ్బల మంగమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



బుట్టాయగూడెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పశ్చిమ మన్యం ఆరాధ్యదైవం గుబ్బల మంగమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారుజామునుంచే అమ్మవారిని దర్శిం చుకోడానికి బారులు తీరారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తజనంతో కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆల భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.



జాతీయ స్థాయి టి-20 కి 16 మంది ఎంపిక

భీమవరం టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బధిర (మూగ చెముడు) 7వ జాతీయ టీ-20 క్రికెట్ పోటీలకు 16 మంది ఎంపికయ్యారని జిల్లా బధిర క్రికెట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ తాతారావు తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికైన 16 మంది బధిర క్రీడాకారులు వచ్చేనెల 16 నుంచి 19 వరకు హర్యానా కాచపూర్ గురుగావ్‌లో బధిర క్రికెట్ టి-20 పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆదివారం భీమవరం వెంకట్రామ థియేటర్‌లో వివరాలను తెలిపారు. ఇటీవల భీమవరం డీఎన్నార్ క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి టి-20 క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారుల్లో 16 మంది జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.ఆర్గ నైజింగ్ వైస్ ఛైర్మన్ రాము, కోశాధికారి రామ చంద్ర రావు, బిహెచ్ రవికుమార్ రాజు పాల్గొన్నారు.

పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

తణుకు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు అండగా ఉండాలని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఉచితంగా వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మార్చి 1 నుంచి 31వ తేదీ వరకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెప్పారు. పశువుకు తీవ్రమైన జ్వరం, నీరసం, కాలిగిట్టల మధ్య పుండ్లు, చూడి పశువులు ఈసుకుపోవడం వంటి లక్షణాలు గాలి గుంటు వ్యాధి కిందకు వస్తాయి. ఇది ఒక పశువు నుంచి మరో పశువుకు సంక్రమించే అవకాశం ఉండటంతో రైతులు ఆర్థికంగా నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి. టీకాలు వేయడం వల్ల వ్యాధి సోకిన పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చు. దూడల్లో మర ణాలు తగ్గించి ఆరోగ్యంగా ఎదగడానికి దోహదపడుతుంది. ప్రభుత్వం అందించే టీకాలు వేయించడం ద్వారానే బ్రూసెల్లో వ్యాధి నివారించవచ్చును.మూడు నెలలు వయసు దాటిన ప్రతి పశువుకు తప్పని సరిగా టీకాలు వేయించాల్సి ఉంది. నాలుగు నుంచి ఎనిమిది నెలలు వయసు గల పెయ్యి దూడలకు బ్రూసెల్లోస్ టీకాలు వేయించాలి.



రంజాన్ మాసం వచ్చేసింది. ఈ 30 రోజులూ ముస్లింలకు పండగే. ఈ నెలంతా ఉపవాస దీక్షలతో అల్లాను భక్తితో ఆరాధిస్తారు. రంజాన్ నెలను ముస్లింలు పవిత్రంగా భావిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మసీదుల్లో ప్రార్థనలు చేస్తారు. ముస్లింల జీవన విధానంలో ఈ నెల రోజులు చాలా మార్పు కనిపిస్తుంది. మసీదులన్నీ రంజాన్ కోసం ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలతో అలంకరించుకున్నాయి. మార్కెట్లకు రంజాన్ కళ వచ్చింది.

ఈద్ ముబారక్

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

గణపవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): దైవప్రవక్త హజరత్ మహ్మద్ సంవత్సరంలో 12 మాసాల్లో ఒక మాసం సానుభూతి చూపాలని ఆదేశించారు. అప్పటి నుంచి పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపడతారు.రంజాన్ నెలరోజులు ఏ మసీదు చూసిన ముస్లిం ప్రార్థనలతో నిండి ఉంటుంది. నెల రోజుల ఉపవాస దీక్ష కూడా ప్రత్యేకంగా ఉంటుంది. ఆహారం తీసుకునే పద్ధతుల్లో, నియమాల్లో మార్పు ఉంటుంది. సూర్యోదయానికి ముందే ఆహారం తీసుకుంటారు. సాయంత్రం సూర్యాస్తమయం తరువాతే మళ్లీ ఆహారం. అంటే ఒక పూట ఉపవాసం ఉంటారు. ఈ ఉపవాసం కూడా చాలా దీక్షగా చేస్తారు. కనీసం నీటిని కూడా తీసుకోరు. ఎక్కువగా డ్రైఫ్రూట్స్‌నే ఆహారంగా తీసుకుంటారు. ఈ నెలంతా సేమియాకు కూడా మంచి డిమాండ్ ఉంటుంది. ఏ ముస్లిం గృహానికి వెళ్లిన సేమియా రుచి చూడాల్సిందే. అంతేకాదు.. హిందువులు, ముస్లింలు ఒకరినొకరు ఇళ్లకు ఆహ్వానించి ఇఫ్తార్ విందు ఇవ్వడం అనవాయితీగా వస్తున్నది. ఇది హిందూ, ముస్లిం ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

పేదలకు ధానధర్మాలు

ఈద్ - ఉల్ - ఫితర్ అంటే ధానధర్మాల పండుగ అని అర్థం. చివరి ఉపవాసం రోజున నెలవంక చూసిన మరుసటి రోజు ఈద్ నమాజ్‌కు ముందే ముస్లిం ఫిత్రా చెల్లిస్తారు. ధనిక, పేద, చిన్న తేడా లేకుండా కుటుంబంలో ఎంతమంది సభ్యులుంటే అంత మంది పక్షాన ఫిత్రా చెల్లించాలి. స్థితిమంతులు తాము సంపాదించిన దానిలో తోచినంత బీదవారికి దానం ఇవ్వడం వలన అల్లా ఆశీస్సులతో శుభ సంతోషాలు లభిస్తాయని నమ్మకం. కొంతమంది ముస్లింలు అయితే ప్రతీ ఏడాది కొంతమొత్తం పేదలకు దానం చేస్తారు. మసీదుకు వెళ్లినప్పుడు ఒకదారి, తిరిగి వచ్చేటప్పుడు మరో దారిలో రావడం ఉత్తమంగా భావిస్తారు. నమాజ్ ముగిసిన తరువాత గురువు ఉపదేశం ఇస్తారు.

ప్రతీరోజు 5 పూటలా నమాజు



సమాజ శాంతికి ఇస్లాం విధిగా నిర్ధయించిన ఆరాధన విధా నాల్లో మొట్టమొదటిది నమాజ్. ఈ రంజాన్ పండుగ నెల రోజు ల్లోనూ ప్రతీ రోజు ఐదుపూటలా నమాజ్ ఆచరిస్తాం. ఈ మాసంలో నియమనిష్టలతో ఉంటే జీవితానికి పరిపూర్ణత లభిస్తుంది.

- అరమాన్ రజాక్ ఖదారి, మసీదు పెదగురువు, గణపవరం

30 రోజులు ఉపవాస దీక్ష



రంజాన్ నెలరోజులు భక్తిశ్రద్ధలతో ఉంటాం. ప్రతీ ఒక్కరు 30 రోజులపాటు దీక్ష పాటించాలి. కుటుంబసభ్యులు మనిషికి ఒకటి చొప్పున రెండున్నర కిలోల గోధుమలు లేదా వాటి విలువ సొమ్మును ఫిత్రాగా ఇవ్వాలి. ఇతరుల బాధలు తీర్చడం కోసమే ధానధర్మాలు చేయాలి.

-ఎండీ గఫూర్, గణపవరం



విద్యుత్ దీపాలతో అలంకరించిన పాలకొల్లు మెయిన్ రోడ్డులోని మసీదు

శుభాల సరోవరం

పాలకొల్లు అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ముస్లిములు చాంద్రమాన క్యాలెండర్‌ను అనుసరిస్తారు. దీని ప్రకారం రంజాన్ 9వ మాసం నెలవంక దర్శనం అనంతరం ప్రారంభం అవుతుంది. ఈ నెలలో ప్రతీ రోజూ సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ముస్లీంలు ఉపవాస దీక్షలో ఉంటారు. దీనిని రోజా అని పిలుస్తారు. ఉపవాస దీక్షను మూడు భాగాలుగా విభజిస్తారు. తొలి 10 రోజులు ఉపవాస కాలాన్ని రహ్మత్ అని, తరువాత వచ్చే 10 దినాలను బర్కత్ అని చివరి దినాలను మగ్ఫిరత్ అని పిలుస్తారు. ఉపవాస దీక్షలు ముగింపు రోజున నెల వంక దర్శనం అనంతరం రంజాన్ పండుగ జరుపుకుంటారు. ముస్లింల మతగ్రంథం ఖురాన్ ఈ మాసం లోనే అవిర్భవించిదని ముస్లిం పెద్దలు చెబుతున్నారు. శని వారం రాత్రి పట్టణంలోని మసీదులో జరిగిన కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మాట్లాడుతూ శుభాల సరోవరం, వరాల వసంతం రంజాన్ మాసం అని తెలిపారు. ఈ మాసంలో ఒక ఉపవాసం ఉంటే 70 ఉపవాసాలతో సమానమన్నారు. అలాగే తరావీహ్ అనే ప్రత్యేక ప్రార్థన చేస్తారని, ఈ మాసంలో ఒక పుణ్య కార్యం చేస్తే 70 పుణ్యాలు చేసిన ఫలం లభిస్తుందని తెలిపారు.



పెంటపాడులో కూరగాయల దుకాణం

దిగిరాని కూరగాయల ధరలు

పెంటపాడు/ ఏలూరు కార్పొరేషన్ మార్చి 2(ఆంధ్రజ్యోతి) : కూరగాయల ధరలు దిగి రాలేదు. కొన్ని వారాల నుంచి కూరగాయల ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. కొన్ని కూరగాయలు పెరుగుతున్నాయి. టమాటా ధర తగ్గింది. బీన్స్, కాప్సికం, చిక్కుడు ధరలు మాత్రం ఆకాశాన్ని తాకాయి. ఆదివారం మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. బీరకాయ కేజీ 50, దొండకాయ కేజీ రూ.40, బెండకాయ రూ.40, తెల్ల వంకాయిలు కేజీ రూ.40, నల్ల వంకాయిలు కేజీ రూ.40, అల్లం కేజీ రూ.60, మునక్కాయలు కాయ ఒకటి రూ.15, ఆనపకాయ ఒక్కటి రూ.15, దోసకాయ కేజీ రూ.40, అరిటి కాయలు 3 రూ. 20 , క్యారెట్ రూ.40, బీట్‌రూట్ రూ.40, టమాటో కేజీ రూ 20 , బీన్స్ కేజీ రూ.80 , కాప్సికం రూ.80, చిక్కుడు కేజీ రూ.80, పచ్చి మిర్చి కేజీ రూ.40, కొత్తిమీర కేజీ రూ.60 , కట్ట ఒకటి రూ.20, ఉల్లిపా యలు నాణ్యత ఆధారంగా కిలో రూ.30 నుంచి రూ.40 వరకు అమ్ము తున్నారు. కూరగాయల ధరలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ జరపడంతో రైతుబజార్లలో ధరలు అందుబాటులోకి వచ్చాయి. ఏలూరు రైతు బజార్లలో ధరలు ఇలా ఉన్నాయి.. కిలో టమోటా రూ. 16, వంకా యలు రూ. 24, బెండ రూ. 36, మిర్చి రూ. 28, బీర రూ. 32, క్యాబేజి రూ.16, క్యాలీఫ్లవర్ 30, క్యారెట్ రూ. 34, దొండ రూ.38, గోరుచిక్కుడు రూ. 40, చిక్కుడు రూ. 60, దోస రూ. 20, బీట్‌రూట్ రూ.34, అల్లం రూ. 60, క్యాప్సికం రూ. 56, సొరకాయ రూ. 25, అరటికాయ ఒక్కటి రూ. 6, గోంగూర, తోటకూర, పాలకూర, చుక్కకూర, మెంతుకూర కట్ట రూ. 10 చొప్పున అమ్మకాలు జరుపుతున్నారు.


5 కిలోల మారేడు కాయ



పాలకొల్లు అర్బన్, 3 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పట్టణంలోని చిన్నగోపురం వీధిలో గల బంగారు శిరీష, మురళీధర్ ఇంటి పెరడులో ఉన్న మారేడు చెట్టుకు 5 కిలోల బరువు గల కాయ కాసింది. 2007లో కడియం నుంచి తీసుకువచ్చి ఉసిరి, మారేడు మొక్కలు తమ ఇంటి పెరడులో నాటినట్టు శిరీష తెలిపారు. గతంలో ఎన్నడూ ఇంత పెద్దకాయ కాయలేద న్నారు. ఇది తెలిసిన చాలామంది వచ్చి చూసి ఇది మహాశివుడి మహత్యం అని నమస్కరించి వెళుతున్నారు.

వన్యప్రాణులకు ఆలవాలం పాపికొండల అభయారణ్యం

నేడు ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం





అభయారణ్యంలో చిరుత, జింక

పోలవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో ప్రతి ప్రాణికి తమ స్వేచ్ఛా ప్రపంచంలో నిర్భయంగా బతికే హక్కు ఉంది. కానీ మానవుడు తన తన స్వార్థం కోసం అడవులపై పడి వనాలను తగులబెట్టి, వన్యప్రాణులను వేటాడడం వంటి అకృత్యా లకు పాల్పడి జీవ వైవిధ్యం మనుగడకు ముప్పు తెస్తున్నాడు.అడవులు అంతరించి అడవుల్లో జీవించే వన్యప్రాణులు జనారణ్యాల లోకి వచ్చి మృత్యువు పాలవుతున్నాయి.ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా వన్య ప్రాణుల సంరక్షణ గురించి మన ప్రాంతాల్లో వన్య ప్రాణుల సంచారం గురించి తెలుసుకుందాం. ఐక్యరాజ్య సమితి వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం ప్రతి ఏటా మార్చి 3 జరుపుకోవడానికి నిర్ణయించింది. అంతరించిపోతున్న అడవి జంతుజాలం, వృక్షజాలం జాతుల సంరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుకోవడమే గాక అటవీశాఖ ఆధ్వర్యంలో అడవుల సమీపాల్లో ఉన్న గ్రామాల్లో వేట వృత్తిగా జీవిచే గిరిజనులకు వన్యప్రాణుల సంరక్షణ గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో పోలవరం నుండి జీలుగుమిల్లి వరకూ అక్కడి నుండి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం వరకూ అరణ్యాలు విస్తరించి ఉన్నాయి. ఏలూరు జిల్లా కృష్ణా జిల్లాల పరిధిలో 673 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కొల్లేరు పక్షుల సంరక్షణ కేంద్రం ఉంది. తడికలపూడి అడవులు, నల్లజర్ల అడవుల్లో సైతం వన్యప్రాణుల కదలికలు ఉన్నాయి. పోలవరం నుంచి గోదావరి ఎగువన నదీ పరివాహక ప్రాంతానికి ఇరువైపులా ఖమ్మం జిల్లా వరకూ అడవులు విస్తరించి ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టు కోసం గిరిజన గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించడంతో పాపికొండల అభయా రణ్యంలో వన్య ప్రాణుల సంచారం పెరిగింది. గతంలో కంటే పాపికొండల అభయారణ్యంలో వన్య ప్రాణుల సంతతి గణనీయంగా పెరిగిందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. పాపికొండల అభయారణ్యంలో గొర్రెగేదెలు, నెమళ్ళు, జింకలు, చిరుతలు, ఎలుగుబంట్లు, కొండగొర్రెలు, కుందేళ్ళు, నక్కలు, మొసళ్ళు, పులులు,అడవిపందులు, పాములు ఇతర జంతుజాలం గతంలో కంటే పెరిగింది. మైదాన ప్రాంతాల నుంచి గొర్రెల కాపరులు పాపి కొండల అభయారణ్యాలలోకి తమ గొర్రెల మందలను మేపడానికి వెళ్లడం వల్ల, అడవులను తగులబెట్టడం, పాపికొండల టూరిజం బోట్లలో డీజే మైక్ సౌండ్‌లు వినియోగించడం వల్ల వాటి స్వేచ్ఛకు భంగం కలిగి ప్రాణభయంతో జనావాసాల్లోకి వస్తున్నాయి. గతంలో అడవుల నుండి తప్పిపోయి వచ్చిన గొర్రెగేదె దాడిలో పోలవరం మండలం ఎల్లండిపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు మృతి చెందింది. ఈ వేసవిలో నీటి కోసం వచ్చే వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ ప్రాంతాల్లో పలుచోట్ల నీటి కుంటలు, చెక్‌డ్యాంలలో నీటి నిల్వలు ఉంచడం ద్వారా వన్యప్రాణులు నీటి కోసం జనావాసాల్లోకి వచ్చే అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలి.

రాజమహేంద్రవరంలో ప్రధాన కేంద్రం

అటవీక్షేత్రాధికారి ఎస్‌కె వలీ, పోలవరం

పాపికొండల అభయారణ్యం పోలవరం రేంజ్ 9 వేల హెక్టార్లలో విస్తీర్ణంలో విస్తరించి ఉంది. తూర్పు గోదావరి జిల్లా, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా రంపచోడవరం, కుక్కునూరు వేలేరుపాడు మండలాల పరిధిలో ఉన్న అరణ్యాలను 7 రేంజ్‌లుగా విభజించారు. 7 రేంజ్‌లను కలిపి రాజమహేంద్రవరంలో ప్రధాన కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడు రేంజ్‌ల పరిధిలో వన్యప్రాణులకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా ఆ కేంద్రం ద్వారా వన్యప్రాణులకు వైద్యసేవలు, సంరక్షణ, సంతతి అభివృద్ధి కార్యక్రమాలు అందించబడతాయి.



కాలువలోకి దూసుకు వెళ్లిన రొయ్యల లారీ

కాళ్ళ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కాళ్ళలో ఆదివారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకోవడం వల్ల రొయ్యలతో వెళ్తున్న కంటైనర్ లారీ ప్రమాదవశాత్తు రుద్రాయకోడు మురుగు కాలువలోకి దూసుకెళ్ళింది. స్థానిక రైతులు, గ్రామస్తులు వెంటనే క్రేన్ల సహాయంతో లారీని పైకి తీసుకువచ్చారు. కంటైనర్ సీజ్ చేసి ఉండటంతో రొయ్యలు లారీలోనే సురక్షితంగా ఉన్నాయని రైతులు చెప్పారు. ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదన్నారు.



ధ్వంసమైన కారు ముందుభాగం

ముందు వెళుతున్న వాహనాన్ని ఢీకొట్టిన కారు

ఐదుగురికి గాయాలు

దెందులూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): దెందులూరు హైవే వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుం బానికి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. సమయానికి కారులో బెలూన్ ఓపెన్ కావడంతో గాయాలతో బయటపడ్డారు. ఇందులో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రాజమండ్రి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీ పంలో నివాసం ఉంటున్న ఊట్ల రామకృష్ణ కుటుంబం ఐదుగురు శనివారం పిడుగురాళ్లకు వివాహానికి వెళ్లి ఆదివారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా దెందులూరు పెట్రోల్ బంకు దాటి గుండేరు వాగు సమీపంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని వీరు ప్రయాణిస్తున్న కారు బలంగా వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న రామకృష్ణకు అతని అమ్మమ్మ అనంతలక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

క్రైమ్ కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ఒకటవ పట్టణం గునుపూడికి చెందిన వి. వెంకట సుబ్రహ్మణ్యం (54) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు. వెంకట సుబ్రహ్మణ్యం ఫిబ్రవరి 19న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వాహనం అదుపు తప్పి కిందకు పడిపోగా గాయపడ్డారు. మెరుగైన చికిత్సకు మంగళగిరిలోని ఆసుపత్రిలో చేర్పగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారన్నారు. ఏఎస్ఐ కె.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహం

ఉండి, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ఉండి నుంచి ఉప్పుగుంటకు వెళ్లే పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహం వుందని ఉండి ఎస్ఐ నజీరుల్లా తెలిపారు. ఉండి గ్రామం నుంచి ఉప్పుగుంటకు వెళ్లే పంటకాలువలో లేత పసుపురంగు టీషర్టు, బ్లూరంగు జీన్ ప్యాంటు వేసుకుని వున్న సమారు 35 నుంచి 40 సంవత్సరాల గల గుర్తు తెలియని మృతదేహం వుందన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96648 నంబరును సంప్రదించాలని కోరారు.

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి

ఆగిరిపల్లి, మార్చి 2 (ఆంధ్ర జ్యోతి):మండలంలోని అమ్మవారిగూడెం వద్ద ఆటో బోల్తాపడి యువకుడు మృతిచెందాడు. ఆగిరిపల్లికి చెందిన కూరపాటి నాని (31) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఆగిరిపల్లి నుంచి బండారుగూడెంకి ఆటోలో గోనెసంచులు లోడుతో వెళుతుండగా అమ్మవారిగూడెం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నానికి తలకి బలమైన గాయం అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. యువ కుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.





ఎస్ఐ నియామకపు ఉత్తర్వులను అందిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్.. పాల్గొన్న నూతన ఎస్ఐలు

ఏలూరు రేంజ్‌కు 100 మంది ఎస్ఐలు

నియామక ఉత్తర్వులు అందజేసిన ఐజీ అశోక్ కుమార్

ఏలూరు క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా పని చేస్తూ బాధితులకు న్యాయం చేయాలని, ముద్దాయిలకు శిక్ష పడేలా పనిచేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవిజీ అశోక్‌కుమార్ అన్నారు. అనంతపురం పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వంద మంది 2024 బ్యాచ్ ఎస్ఐలు ఏలూరు రేంజ్‌నకు వచ్చారు. వీరిలో 68 మంది పురుషులు, 32 మంది మహిళలు ఉన్నారు. వీరికి ఏలూరు ఐజీ కార్యాలయంలో ఎస్ఐ నియామక ఉత్తర్వులను అందించారు. ఐజీ మాట్లాడుతూ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తూ పోలీస్‌శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏలూరు రేంజ్ పరిధిలో అల్లూరి సీతారామ రాజు జిల్లాకు నలుగురు, కాకినాడ జిల్లాకు ఇద్దరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు ఒకరు, తూర్పు గోదావరి జిల్లాకు 15, పశ్చిమ గోదావరి జిల్లాకు ఒకరు, ఏలూరు జిల్లాకు ఒకరు, కృష్ణాజిల్లాకు 20 మంది, ఎన్టీఆర్ జిల్లా 56 మందిని ఆయా జిల్లాలకు కేటాయిస్తూ నియామకపు ఉత్తర్వులను అందించి అభినందించారు.

త్వరితగతిన ఆర్వోబీ నిర్మాణం : మంత్రి వర్మ

ఉండి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉండి-ఆకివీడు 165 రహదారిలో నిలిచిపోయిన ఆర్వోబీ పనులు త్వరితగతిన పూర్తిచేయడానికి చర్యలు చేపట్టినట్టు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ వెల్లడించారు. ఆదివారం చిలుకూరులోని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రుద్రరాజు శివవర్మ ఇంటివద్ద విలేకరులతో మాట్లాడారు. ఆకివీడు నుంచి చెరుకువాడ, పెదపుల్లేరు, చినపుల్లేరు, పెద అమిరం, భీమవరం మీదుగా వీరవాసరం వెళ్లే 165 బైపాస్ రోడ్డు నిర్మాణానికి త్వరలో పనులు చేపడతారని తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ఇరగవరం విద్యార్థి ప్రతిభ

ఇరగవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వీరవాసరం మండలం శృంగవృక్షంలో జరిగిన సెంట్రల్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో ఇరగవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థి జి. దుర్గా మల్లేశ్వర రావు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. నాగమణి తెలిపారు. 400 మీటర్ల పరుగులో ప్రథమ, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. విద్యార్థికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్. సతీష్‌బాబు, కె బాబూరావు, నాగమణిని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

తణుకు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3 నుంచి 20వ తేదీ వరకు పశువులలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల పశువైద్యాధికారి కె. శంకర్ భావనారాయణ తెలిపారు. టీకాలను 4 నెలల నుంచి 8 నెలల వయస్సు గల పెయ్యి దూడలకు ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో ముద్దాపురం, వేల్పూరు, 5, 6 కోనాల, వేల్పూరు, ఈ నెల 7, 8, 10 తేదీల్లో దువ్వ, వేల్పూరు గ్రామాల్లో, 11న దువ్వ, మహాలక్ష్మి చెరువు, 12న దువ్వ యర్రాయి చెరువు, 13, 14 తేదీల్లో దువ్వ, కొమరవరం, 15, 17 తేదీల్లో తేతలి, 18, 19, 20 తేదీల్లో మండపాకలో టీకాలు వేస్తారని తెలిపారు.

ఇరగవరంలో ఇలా...

ఇరగవరం: మండలంలో పశువైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి అన్ని గ్రామాల్లో పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. 3న సూరంపూడి - ఏలేటిపాడు, 4న తూర్పు విప్పర్రు- ఓగిడి, 5న గోటేరు-కె. కుముదవల్లి, 6న అర్జునుడుపాలెం-ఆర్ ఖండ్రిక, 7న ఇరగవరం-అయితంపూడి, 8న కంతేరు-రాపాక, 10న కత్తవపాడు, 11న పొదలాడ, రేలంగి, 12న కాకిలేరు, కావలిపురం, 13న అయినపర్రు, 15న కొత్తపాడులో పశువులన్నింటికి టీకాలు వేయడం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ట్రెజరీ అకౌంట్స్ సర్వీస్ సంఘ కార్యవర్గం

భీమవరం టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ట్రెజరీస్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా సంఘ ఎన్నికలు ఆదివారం కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా జే. రామరావు, కార్య దర్శిగా ఎం.సత్యనారాయణ, సహాధ్యక్షులుగా కే.ఎం.కే. హనుమంత రావు, ఉపాధ్యక్షులుగా వి.ఎస్.ఎస్. శ్రీనివాస్, ఎన్. సీతారామయ్య, డి. పుష్ప లత, కార్యదర్శిగా ఎం. సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.నరేంద్ర రాజు, సంయుక్త కార్యదర్శులుగా డి. నాగ భూషణం, జే. తిరుపతి రెడ్డి వి. శారద దేవి, ట్రెజరర్‌గా పి. కొండల రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి షేక్ అబ్దుల్ ఖాదర్ తెలిపారు.

ఎమ్మెల్యే బొలిశెట్టి వితరణ



తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : తెలుగు సంస్కృతి, సంప్రదాయల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డు రామాలయంలో కోలాట భజన చిన్నారులకు యూనిఫాం నిమిత్తం రూ. 20 వేలు ఎమ్మెల్యే అందజేశారు. అడపా నారాయణమూర్తి, పాలూరి వెంకటేశ్వరరావు, వాడపల్లి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ విద్యా సామగ్రి అందజేత

పెంటపాడు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అభినందనీయమని హెచ్ఎం శారద అన్నారు. అలంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు అలంపురం హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్యాడ్స్, పెన్నులు తదితర విద్యా సామగ్రి అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు కావలిపురపు బాలకృష్ణ, కార్యదర్శి తిరుపతి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం : అంజిబాబు

భీమవరం టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం మండలం రాయ కుదురు గుడాలవారి వీధిలో షార్టుసర్క్యూట్‌తో తోట రాంపండు తాటాకిల్లు అగ్నికి ఆహుతవడంతో బాధితులను ఎమ్మెల్యే పరామర్శించారు. దాతల సహకారంతో నిత్యావసర వస్తువులు, నగదును ఆయన అందించారు. అలాగే సోమేశ్వరస్వామి రథోత్సవంలో కరెంట్ స్తంభం పడి గాయపడి చికిత్స పొందుతున్న బండి రాజేశ్వరిని ఎమ్మెల్యే పరామర్శించారు.

స్వర్ణాంధ్ర లక్ష్యంగా బడ్జెట్ : మంతెన, తోట

భీమవరం అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా బడ్జెట్ ఉందని ఏపీఐఐసీ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు మంతెన రామారాజు, టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి తెలిపారు. ఆదివారం వారు బడ్జెట్ పై తమ అభిప్రాయం తెలిపారు. జగన్ ప్రభుత్వ విధించిన దుర్మార్గపు పన్నులను తొలగిస్తూ కొత్త పన్నులను విధించకుండా రాష్ట్ర రెవెన్యూ సమకూరేలా మూలధన వ్యయానికి నిధులు కేటాయించారన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలకు నిధులు కేటాయించడంతో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు.

హామీల అమలుకు బడ్జెట్‌తో శ్రీకారం : పొత్తూరి



నరసాపురం టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా అడుగులు వేస్తోందని, దానికి బడ్జెట్ కేటాయింపులే నిదర్శనమని నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలుపై విపక్షాల ఆరోపణలను ఖండించారు. సంక్షేమం, అభివృద్ధి, మౌలిక వసతులకు బడ్జెట్‌లో చూపించిన కేటాయింపులు విపక్షాలకు కనిపించడం లేదని, అందుకే ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. బీసీ సంక్షేమానికి రూ47వేలకోట్లు, వ్యవసాయానికి రూ.18వేల కోట్లు, అన్నదాతా సుఖీభవకు రూ.6300 కోట్లు, తల్లికి వందనానికి రూ.9 వేల కోట్లు ప్రభుత్వం కేటాయించిన విషయాన్ని పొత్తూరి గుర్తు చేశారు.

నిధుల కేటాయింపు భేష్ : పద్మనాభుని



తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్యవైశ్య సంక్షేమ కార్పొరేషన్‌కు కూటమి ప్రభుత్వం రూ. 515.95 కోట్లు కేటాయించడం అభినందనీయమని ఆర్యవైశ్య సంక్షేమ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ పద్మనాభుని మురళి అన్నారు. గత ప్రభుత్వం కార్పొరేషన్ల పేరుతో పదవులు కేటాయించింది తప్ప బడ్జెట్లో నిధులు కేటాయించలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన వారందరికి కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేసి వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీసీ సంక్షేమ శాఖా మంత్రి సావిత్రమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

జోగయ్యకు బన్నీ వాసు పరామర్శ



పాలకొల్లు , మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, కాపు, బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి వెంకట హరిరామ జోగయ్యను సినీ నిర్మాత బన్నీ వాసు ఆదివారం జోగయ్య నివాసంలో కలిసి పరామర్శించారు. వయస్సు రీత్యా వచ్చే అనారోగ్య సమస్యల వల్ల ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన జోగయ్యను బన్నీ వాసు పరామర్శించారు. వాసు వెంట జనసేన నాయకులు బోణం చినబాబు, విరాకుల రమణ ఉన్నారు.

వీటి సంగతేంటి?

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

పిచ్చిమొక్కలతో నిండిన ప్రాంగణాలు..



చిట్టడవిని తలపిస్తున్న వసతి గృహ ప్రాంగణం

యలమంచిలి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఏ భవనమైనా నాణ్యతతో నిర్మించినప్పటికీ సకాలంలో నిర్వహణ పనులు చేయకుండా వదిలేస్తే ఆ భవనాలు అతి తక్కువ కాలంలో శిథిలస్థితికి చేరతాయి. మండలంలో లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులతో నిర్మించిన పాలశీతలీకరణ కేంద్రం, క్లస్టర్ రిసోర్స్ సెంటర్, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం భవనాలు ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంటున్నాయి.

●మండలంలోని ఆర్యపేట గ్రామ పరిధిలో ప్రధాన రహదారి పక్కన సుమారు రూ.5.50లక్షల నిధులతో 2011లో నిర్మించిన గోదావరి మిల్క్ గ్రిడ్ ప్రాజెక్టు పాలశీతలీకరణ కేంద్రం ఏర్పాటైంది. అనంతరం ఏడాది తరువాత మూతపడింది. ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేక శిథిల స్థితికి చేరుతోంది.

● విద్యాశాఖ క్లస్టర్ రిసోర్స్ సెంటరు భవనాన్ని 2008లో సుమారు రూ.2లక్షలతో యలమంచిలి హైస్కూలు క్రీడా ప్రాంగణంలో నిర్మించారు. ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాలు వంటివి నిర్వహించేందుకు ఏర్పాటైన ఈ భవనంలో ఒకటి, రెండు సమావేశాలు మాత్రమే జరిగాయని అనంతరం దీనిని వినియోగించిన దాఖలాలు లేవని స్థానికులు చెబుతు న్నారు. ఈ భవనానికి ఇప్పటివరకూ విద్యుత్తు కనెక్షన్ లేకపోవడం గమనార్హం. నిర్వహణ కొరవడటంతో పిచ్చిమొక్కలు మొలిచి భవన ప్రాంగణాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి.

●యలమంచిలిలో సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహం ఐదేళ్ల క్రితం మూతపడింది. సుమారు 10 గదులతో ఉన్న భవనం నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుతోంది. ప్రాంగణంలో పెద్దఎత్తున పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. నిరుపయోగంగా ఉన్న భవనాలను అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న క్లస్టర్ రిసోర్స్ సెంటరు



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

పెంటపాడు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పెంటపాడు ఎస్‌టీవీఎన్ పాఠశాలలో 1996-97 సంవత్సరానికి చెందిన టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కుటుంబాలతో హాజరై నాటి స్మృతులను నెమరువేసుకున్నారు. నాడు తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. తమ బ్యాచ్‌లో చనిపోయిన స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలని తీర్మానించుకున్నారు.



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

భాష్యంలో గ్రాడ్యుయేషన్ డే

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం భాష్యం స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ. ఆశాదీప్తి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. భాష్యం వెస్ట్ జోన్ సీఈవో శ్రీమన్నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ రొక్కం కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరందడంలేదని రైతుల నిరసన



అత్తిలి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అత్తిలి మండలం ఈడూరు గ్రామ పంచాయతీ పరిధిలో దాళ్వా పంటకు సాగునీరు అందక వరి పొలాలు బీడు వారాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దాళ్వా పంటకు ఒక ఎకరానికి రూ. 35 వేలు పెట్టుబడి పెట్టామని తీరా పంట ఈనిక దశకు వచ్చేటప్పటికి సాగునీరదక చేలు బీడువారి పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఈడూరులో పంట చేలోకి దిగి ఆందోళన చేశారు. ఇప్పటికే అప్పులు తెచ్చి పెట్టుబడిపెట్టి కౌలు వ్యవసాయం చేస్తున్న తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్‌తో పాటు గ్రామ రైతులు సంకు లక్ష్మణరావు, బొక్కా యాకోబు, వనపల్లి సుబ్బారావు తదితరులు నిరసన లో పాల్గొన్నారు.

క్షీరారామం, మావుళ్లమ్మ ఆలయాల్లో ఓంకార్ పూజలు



పాలకొల్లు అర్బన్, మార్చి 2 (ఆంధ్ర జ్యోతి): బుల్లితెర నటుడు, యాంకర్ ఓంకార్ ఆదివారం పంచారామాల్లో ఒకటైన పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకుని స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. ఆయనకు ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, అర్చకులు స్వామివారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని అందించారు.

భీమవరం టౌన్: మావుళ్ళమ్మ వారిని ఆదివారం ఓంకార్ దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరఫున ప్రసాదాన్ని, శేష వస్త్రాన్నిఅందించారు. ఆలయ ఇవో నగేష్ పర్యవేక్షించారు.

మంత్రి మనోహర్ సమక్షంలో జనసేనలో చేరికలు

పాలకొల్లు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మండెల రజనీ కుమార్ తదితరులు ఆదివారం జనసేనలో చేరారు. రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తూర్పు గోదావరి పర్యటన ముగించుకుని భీమవరం వెళుతుండగా పూలపల్లి బైపాస్‌రోడ్డులోగల ఫంక్షన్‌హాల్లో మంత్రి మనోహర్‌ను కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి జనసేన కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.





చిలుకూరులో కోదండరామాలయం పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రి వర్మ.. మార్టేరు గ్రామ దేవత పోలేరమ్మ జాతర సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే పితాని

తాగునీటి ఎద్దడి రానివ్వం

ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ హరి మోహన్



తణుకు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రానివ్వమని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ ఎ. హరిమోహన్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. పంచాయతీల్లో ఆర్థిక సంఘం నిధులను తాగునీటి అవసరాలకు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించామన్నారు. నియోజకవర్గంలోని పంచాయతీలలో తాగునీటి చెరువులను కాలువల కట్టే నాటికి నింపుతామని, ఆరవల్లి, కావలిపురం, ఇరగవరం, కోనాల, మండపాక గ్రామాల పరిధిలోని సీపీడబ్ల్యుఎస్ పథకం ద్వారా పలు గ్రామాలకు తాగునీటి సరఫరా చేస్తున్నామన్నారు. పంచాయతీలలోని తాగునీటి పథకాలు మరమ్మతులకు గురైతే పంచాయతీల నుంచి నిధులు సమకూర్చుకోవాలి.

9 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు

నరసాపురం రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ, మండలంలో తొమ్మిది సెంటర్లలో పది పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో పుష్పరాజ్యం తెలిపారు. సికిలి, గౌతమి, టేలర్, సన్‌షైన్, గొట్టుముక్కల, మండలంలోని గురుకుల పాఠశాల, మిషన్, కొత్తపల్లి సుబ్బారాయుడు, కొప్పర్రు హైస్కూళ్లు ఉన్నాయన్నారు. 1800 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో తెలిపారు.

సంచార శకటంతో వైద్య సేవలు

తణుకు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా ఆదివారం వైద్య సేవలు నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఇంటింటికి వెళ్ళి తణుకు, అజ్జరం ప్రాంతాల్లో పర్యటించి ఐదుగురికి వైద్య సేవలందించారు. సంఘ కార్యదర్శి ఎండీ స్వాలిహా ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ సభ్యుడు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బూత్ కన్వీనర్‌గా నాని

నరసాపురం టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వైసీపీ బూత్ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన కావలి నాని నియమితులయ్యారు. యూత్ అధ్యక్షుడిగా చినమిల్లి చంద్రశేఖర్, మహిళా విభాగంలో విజయశ్యామల, పబ్లిక్ వింగ్ జయవర ప్రసాద్‌తో పాటు పలువురికి పదవులు దక్కాయి. నానిని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, చైర్‌పర్సన్ వెంకట రమణ, ఎంపీపీ సోని అభినందించారు.

పేకాట శిబిరంపై దాడి

ఇరగవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఇరగవరం ఎస్ఐ జానా సతీష్ తెలిపారు. పెద్దిరెడ్డిపాలెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 15,150 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆధ్యాత్మికం

కోదండ రామాలయ ప్రతిష్ఠ

ఉండి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలుకూరులో కోదండరామాలయ పునఃప్రతిష్ఠ వైభవంగా జరిగింది. పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ శ్రీరాముడి ఆశీస్సులతో గ్రామాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. ఆలయ నిర్మాణానికి సహకారించిన దాతలను అభినందించారు. మాజీ ఎమ్మెల్యే శివరామరాజు, ఆలయ కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యనారాయణరాజు, ధర్మకర్త వేగేశ్న వెంకటరమణరాజు, సర్పంచ్ ముదునూరి వెంకట సోమరాజు, పెన్మెత్స భీమరాజు, రుద్రరాజు రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర

పెనుమంట్ర: మార్టేరు గ్రామ దేవత పోలేరమ్మ జాతర సందర్భంగా నృత్యాలు, మేళతాళాలు, బాణా సంచా కాల్పులతో అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కోబ్రా డ్యాన్సులు, బుట్ట బొమ్మల నృత్యాలు ఆకట్టుకు న్నాయి. అమ్మవారిని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కోణాల కోదండ చంద్రశేఖర్ రెడ్డి, తేతలి రాజారెడ్డి, వెలగల బ్రదర్, చిర్ల శ్రీనివాసరెడ్డి, తేతలి సోమిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గరగల ఊరేగింపు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామదేవతలు పోలేరమ్మ, కనకవయ్యారమ్మ, వీరతుడుపులమ్మ, మహాలక్ష్మమ్మ, మహంకాళమ్మ, దండు మారెమ్మ, రణగంగా, చిన మారెమ్మ, పరగంగ, పోతురాజు గరగల ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులంతా వారు మొక్కుకున్న గరగలను వారే స్వయంగా నెత్తిన పెట్టుకుని అమ్మవారి పూరిగుడిసె వరకు ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్థులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్ల దీవెనలు తీసుకున్నారు. ఉగాది సందర్భంగా జాతర నిర్వహించనున్నారు.



మాధవరంలో ఊరేగింపు

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రంలో ఆదివారం త్యాగరాజ గాన సభ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఘట వాయిద్యంతో పాటు త్యాగరాజస్వామి కీర్తనలతో బీవీఆర్ కళా కేంద్రం మార్మోగింది.

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్‌బీ చర్ల గ్రామంలో కొలువైన గంగాలమ్మను ఆదివారం ప్రత్యేకంగా అలంకరించారు. పలు రకాల పూలతో సుందరంగా అలకరించారు. ఇటు సారవ, ఎల్‌బీచర్ల గ్రామాలతో పాటు పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున్న ఆలయానికి విచ్చేసి అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పెనుగొండ: సాలిపేటలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారి శివరాత్రి ప్రభల సంబర ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయం వద్ద ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ఉమెన్స్ డే వేడుకలు

భీమవరం టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా ఒక శక్తి స్వరూపిణి అని కస్తూరిబా జూనియర్ కళాశాల పీడీ లక్ష్మీ కాంతం అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ వరకు మహిళ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని, ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

ఆచంట: ఉమెన్స్ డే వేడుకలను ఆచంట పోలీసులు ఘనంగా నిర్వహించారు. మహిళలకు మెహందీ నిర్వహించారు. ఎస్ఐ వెంకట రమణ మాట్లాడుతూ మహిళలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా తక్షణమే పోలీసులను సంప్రదించాలన్నారు.





భీమవరం, ఆచంటలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలు